విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే జగనన్న ప్రభుత్వం ప్రజల ఆర్థిక పరిస్థితులను చక్కదిద్ది జీవన ప్రమాణాలను మెరుగు పరిచిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి బంటుమిల్లి మండలం కంచడం గ్రామంలో పూర్తి చేసుకున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి గ్రామంలో పర్యటించినప్పుడు ప్రజలకు ఉన్న సమస్యలను తెలుసుకుని నాడు ఇచ్చిన హామీలను నేడు నెరవేర్చి వాటికి ప్రారంభోత్సవం చేశారు. అందులో భాగంగానే గ్రామంలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పంపు హౌస్ లో ఫిల్టర్ బెడ్ల ఏర్పాటు చేయటం వంటి తదితర పనులకు సచివాలయం, ఎంపీ, సీఎం నిధులను వెచ్చించి అభివృద్ధి పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ వెల్నెస్ సెంటర్, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులకు రూ.4.89 కోట్ల నిధులను గ్రామానికి వెచ్చించినట్లు తెలిపారు. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా గ్రామానికి రూ.15 కోట్లు అందించామన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ గతంలో తాను ఈ గ్రామానికి తొలిగా వచ్చినప్పుడు మంచినీటి సమస్య ఉందని గ్రామస్తులు చెప్పినప్పుడు ఆ సమస్య పరిష్కారం కోసం రూ.15 లక్షలు, అదేవిధంగా గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.9 లక్షలు కలిపి మొత్తం రూ.24 లక్షలను అభివృద్ధి పనులకు వినియోగించినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని చెరువులో పూడిక తీతతో పాటు అదనంగా సిసి రోడ్ల నిర్మాణం కోసం మరో రూ.10 లక్షల నిధులను మంజూరు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని చెప్తూ ప్రజలకు ఉన్న సమస్యలను తీర్చేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మండల పరిధిలోని ఆముదాలపల్లి గ్రామంలో నిర్మించిన సచివాలయభవనాన్ని మంత్రి ,ఎంపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ వెలివెల చినబాబు, జడ్పిటిసి మలిశెట్టి వెంకటరమణ, మార్కెట్ యార్డ్ ,వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు, పిఎసిఎస్ చైర్మన్ గంధం శేషగిరిరావు, సర్పంచ్ బందారు చంద్రశేఖర్, ఎంపిటిసి పాపాని భగవాన్, ఆముదాలపల్లి గ్రామ సర్పంచి దాసరి సీయోను కుమారి ,వైస్ ఎంపిపి ఒడిమె చిన్నారి బాబు ,మండల ఎంపీడీవో స్వర్ణ భారతి, తహసిల్దార్ సత్యనారాయణ, పార్టీ నాయకులు ఎం.రాజబాబు, మండలపార్టీ కన్వీనర్ సుజ్ఞానం మహేష్, మట్ట నాగబాబు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం అధికారుల చుట్టం

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ హక్కు చట్టం అధికారుల చుట్టంగా మారుతుందని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ప్రధాన గేటు ముందు జరిగిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం భూ వివాదాలపై సివిల్ కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదని, రాష్ట్ర ప్రభుత్వం చే నియమించబడ్డ టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కు దరఖాస్తు చేసుకోవాలని, వారు ఇచ్చే ఆదేశాలు నచ్చకపోతే ల్యాండ్ టైటిలింగ్ అప్పిలేట్ అధికారికి అపీలు చేసుకోవాల్సి ఉంటుందని, భూ వివాదాల పరిష్కారం బాధ్యత రెవెన్యూ యంత్రాంగ చేతిలో పెట్టడం వల్ల ఈ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది కాబట్టి అధికార పార్టీ నాయకుల రాజకీయ వద్ద అర్హులకు అన్యాయం చేసే అవకాశం ఉందని అన్నారు. ఈ దీక్షలో న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, న్యాయవాదుల సంఘ ప్రధాన కార్యదర్శి కొట్టే రఘురాం మాజీ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్, న్యాయవాదులు బూరగడ్డ అశోక్ కుమార్ కె.జె భాగ్యరాజ్, జీవీఎల్ నరసింహారావు, కూనపురెడ్డి శ్రీనివాస్, న్యాయవాదుల గుమస్తాల సంఘ ప్రధాన కార్యదర్శి టీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. దీక్షకు తెలుగుదేశం నాయకులు మరియు కార్పొరేటర్లు మద్దతు తెలిపారు. సాయంత్రం సీనియర్ న్యాయవాది కొల్లిపర వెంకట రమణమూర్తి దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు.

విద్యార్థులకు బాసటగా ‘జగనన్న విదేశీ విద్యాదీవెన’

విశాలాంధ్ర-మచిలీపట్నం : పేద విద్యార్థులకు విదేశీ విద్య కలగా మిగిలిపోకుండా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం బాసటగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. యుపిఎస్సి నిర్వహించు సివిల్ సర్వీసెస్ పరీక్షలలో ప్రిలిమ్స్ కు అర్హత సాధిస్తే లక్ష రూపాయలు, మెయిన్స్ అర్హత సాధిస్తే మరో 50 వేలు అందించే పథకం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకాన్ని ముఖ్యమంత్రి నూతనంగా ప్రారంభించారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి జగనన్న విదేశీ విద్యా దీవెన ఏడాది రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంతో పాటు తొలిసారి నూతనంగా జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కార్యక్రమం వర్చువల్ గా ప్రారంభించగా, జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి కలెక్టరేట్ నుండి విసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం విదేశాల్లో ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో చదవగలిగే ప్రతిభ ఉండి పేదరికం కారణంగా చదువుకోలేని విద్యార్థులకు గరిష్టంగా రు.1.25 కోట్ల వరకు ఫీజు రియంబర్స్మెంట్ నాలుగు విడతల్లో ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన క్రింద చెల్లిస్తుందని, ఇలాంటి పథకం దేశంలో ఎక్కడా లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి, లబ్ధిదారులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సొసైటీల బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వాణిజ్య బ్యాంకుల కు ఏ మాత్రం తీసిపోకుండా సేవలందిస్తున్న సొసైటీల (పిఏసిఎస్) బలోపేతానికి ప్రతి ఒక్క రైతు సహకరించాలని కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి పిలుపునిచ్చారు. బుధవారం కూచిపూడి పిఏసిఎస్ ప్రాంగణంలో రూ.19.25 లక్షలతో నూతనంగా నిర్మించినభవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భాగస్వామ్యంతో ఏర్పాటైన కేడీసీసీ అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందిస్తూభారతదేశంలోనే అత్యున్నత పేరుపొందినన్నారు. జాతీయ బ్యాంకులతోపాటు పిఏసిఎస్ ల ద్వారా సైతం విదేశీ విద్య, వాహన కొనుగోలు, అపార్ట్మెంట్ల నిర్మాణం, గృహ రుణాలు, డ్వాక్రా గ్రూపులకు, కర్షక మిత్ర సంఘాలకు రుణాలు అందిస్తూ వారి ఆర్థిక పురోభివృద్ధికి సహకరిస్తుందన్నారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ మాట్లాడుతూ రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ అనుబంధ సంఘాల ద్వారా రైతులకు అన్ని విధాల చేయూతనిస్తున్నారు. కూచిపూడి పిఏసిఎస్ చైర్మన్ కైలా శ్రీవల్లి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వెలగం శ్రీనివాసరావు,ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి ఆర్ పార్వతి, సర్పంచ్ లుకొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి అమరబాలేశ్వరరావు (కూచిపూడి), కైతే పల్లిఅన్నామణి(నిరసనగల్లు), తాతారజిని (పెదపూడి), వాకా బాలకృష్ణ (యద్దనపూడి), సొసైటీ మాజీ అధ్యక్షుడు తాతా రాంబాబు, అధికారపార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు,అధికార పార్టీ నాయకులు కైలా రమేష్, కొండేటి చందు, రాజులపాటి మురళి,, సీఈవో డి రాజేష్, తదితరులు ప్రారంభించారు.

26 నుంచి ‘ఆడుదాం ఆంధ్ర’

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం క్రీడలను ప్రోత్సహించే ప్రాముఖ్యత గల కార్యక్రమం అని, ఈ నెల 26వ తేదీన కార్యక్రమాన్ని ప్రారంభించి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి తాడేపల్లిలోని వారి క్యాంపు కార్యాలయం నుండి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు కలెక్టరేట్ వీసీ హాల్ నుండి సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఎల్ డి ఓ సుబ్బారావు, క్రీడల ముఖ్య కోచ్ ఝాన్సీ లతో కలిసి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 26వ తేదీనప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ప్రజలలో అవగాహన పెంపొందించెందు కోసం ముందుగా పెద్ద ఎత్తున త్రీ కే పరుగు, ర్యాలీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా భుజంగ నాయక్

విశాలాంధ్ర-పమిడిముక్కల: కూడేరు కి చెందిన భుజంగ నాయక్ కి రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పదవి అధిష్ఠానం ఇచ్చినట్లు నాయక్ తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి ఇచ్చారని అందరి కలుపుకుని ఆదివాసీ జాతికి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ పదవికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఉపాధ్యక్షుడు ధనేకుల మురళీమోహన్ ప్రధాన కార్యదర్శి మొవ్వ రామ్మోహన్ రావు జిల్లా రాష్ట్ర అధ్యక్షురాలు శాంత కుమారిలకు ధన్యావాదాలు తెలిపారు.

రెండవ బ్యాచ్ ఉచిత కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : స్వామి వివేకానంద సేవా సమితి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత రెండవ బ్యాచ్ కంప్యూటర్ శిక్షణ ప్రారంభించారు. బుధవారం 5వ వార్డులో గల సైబర్ జోన్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ లో ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని వివేకానంద సేవా సమితి సంస్థ చైర్మన్ ఎం ఈశ్వర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. 45 రోజుల పాటు కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చి, ప్రతిభ గల వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. నేడు కంప్యూటర్ ఎంతో ఉపయోగం ఉందని, ప్రతి ఒక్కరూ ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, సైబర్ జోన్ సంస్థ ప్రతినిధి బీసాబత్తిన కృష్ణ లీలా, వివేకానంద సేవా సమితి సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై టీచర్ పైశాచికత్వం!

విశాలాంధ్ర-మచిలీపట్నం : 2వ తరగతి విద్యార్థి శీలం సుకుమార్‌ని చితకబాదిన ఉపాధ్యాయురాలు చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు బుధవారం ప్రాథమిక పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మచిలీపట్నం నవీన్ మిట్టల్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యార్థిని కొట్టారు. ఈ విషయమై సుకుమార్ తల్లిదండ్రులు ప్రాథమిక పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనలకు దిగారు. దీంతో ఒక్కసారిగా పాఠశాల వాతావరణం వేడెక్కింది. ఎందుకు కొట్టారో చెప్పాలని ఉపాధ్యాయురాలిని విద్యార్థి తల్లిదండ్రులు నిలదీయగా ఉపాధ్యాయురాలు సుకుమార్ తల్లిదండ్రుల పట్ల కూడా దురుసుగా ప్రవర్తించింది దీంతో గత్యంతరం లేక ప్రాథమిక పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. తల్లిదండ్రుల ఆందోళనను చిత్రీకరిస్తున్న మీడియాని సైతం సదరు ఉపాధ్యాయురాలు అడ్డుకుంది. ఈ విషయం ఉన్నత అధికారులకు తెలియడంతో ఎంఈఓ దుర్గా ప్రసాద్ పాఠశాల వద్దకు విచ్చేసి, జరిగిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సుకుమార్ తల్లిదండ్రులు వారి బంధువులు ఆందోళన విరమించారు.

ఎల్ఐసి దేశానికి వెన్నుముకగా : సుధాకర్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసి (భారతీయ జీవిత భీమా సంస్థ)దేశానికి వెన్నుముకలాగా పనిచేస్తుందని మచిలీపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి సుధాకర్ బాబు అన్నారు. బుధవారం బంటుమిల్లి ప్రధాన గ్రామంలో ఎల్ఐసి ఎండిఆర్టి - అమెరికా మరియు ఈ ప్రాంతంలో ప్రముఖ ఏజెంట్ అయిన పులి మల్లికార్జునరావు నూతన ఎల్ఐసి ఆథరైజ్డ్ ప్రీమియం పాయింట్ ను సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి సుధాకర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మంగళ వాయిద్యాలతో, వేద మంత్రాలతో సీనియర్ డివిజన్ మేనేజర్ సుధాకర్ బాబుకు ఘన స్వాగతం సత్కారం నిర్వహించారు. అనంతరం పులి మల్లికార్జునరావు యొక్క ఎల్ఐసి వారి ఆథరైజ్డ్ ప్రీమియం పాయింట్ ను రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ ఎల్ఐసి దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుంది అన్నారు. ఎల్ఐసి ఏజెంట్ పులి మల్లికార్జునరావు 2024 సంవత్సరానికి సంబంధించి ఎల్ఐసి వారి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని డాక్టర్ జి సుధాకర్ బాబు మరియు శివనాగు ప్రసాద్ వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ పి శివ నాగ ప్రసాద్, సేల్స్ మేనేజర్ ఎం శివప్రసాద్, క్లియర్ మేనేజర్ టి శివశ్రీ, మచిలీపట్నం బ్రాంచ్ టు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు, డెవలప్మెంట్ ఆఫీసర్లు పి నాగరాజా కుమార్, దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతియ ఇందన పొదుపు వారోత్సవాలు విజయవంతంగా ముగిసాయి. వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని విద్యుత్ శాఖ ఉద్యోగులు బుధవారం బైపాస్ రోడ్డు వద్ద గల సబ్ డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఏలూరు రోడ్డు, నెహ్రూ చౌక్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ సెంటర్ల మీదుగా సాగింది. ఇంధన పొదుపు చేద్దాం, భావితరాలకు వెలుగునిద్దాం అంటూ దారి పొడవున ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డిఈ రామకృష్ణ మాట్లాడుతూ రోజు రోజుకి అంతరించిపోతున్న సహజ వనరులను కాపాడుకునేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రతి ఏటా డిసెంబర్ 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఎల్ఈడి బల్బుల వినియోగం, విద్యుత్ ఆదా చేసేలా ఎలక్ట్రికల్ పరికరాల వినియోగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి విద్యుత్ శక్తిని పొదుపు చేస్తూ భావితరాలకు వెలుగునివ్వడంలో భాగస్వామ్యులు కావాలన్నారు. వారోత్సవాల ముగింపు ర్యాలీలో డివిజన్ పరిధిలోని ఏడీఈలు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు..

ఆర్‌బీలో తుపాన్‌తో నష్టపోయిన రైతుల వివరాలు

విశాలాంధ్ర-గన్నవరం : మిచౌంగ్ తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులు వివరాలను నమోదు చేసి వాటిని సామాజిక తనిఖీ కొరకు రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు. ముస్తాబాద్ రైతు భరోసా కేంద్రం నుండి మండల వ్యవసాయ అధికారి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. మార్పులు గాని చేర్పులు గాని ఉంటే వాటిని ఈనెల 22వ తేదీలోపు సరిచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తేజస్వి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు అగ్రి అడ్వైజరీ బోర్డు మెంబర్స్ మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మణరావు మరియు ధనరాజ్ పాల్గొన్నారు.

మొవ్వ మండలానికి తొలి విడతగా 290 ట్యాబులు

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రభుత్వపాఠశాలల్లో చదివే ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా ఈనెల 21న పంపిణీ చేయాల్సిన ట్యాబులు మొవ్వమండలానికి బుధవారం నాడుతొలి విడతగా 290 కేటాయించారు. మండలంలోని ఎయిడెడ్ పాఠశాలలతో కలిపి 9 హైస్కూళ్ళు, పెదపూడి యూపీ పాఠశాలలలో చదివే 466 మంది ఎనిమిదవ తరగతి విద్యార్థినివిద్యార్థులు ఉండగా మొదటి విడత 290 కేటాయించారని మండల విద్యాశాఖ అధికారిణిబి2 కే శ్రీలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం కాకినాడలోని ఆర్జెడి కార్యాలయం నుంచి వీటిని తీసుకొచ్చి ఎం.ఆర్.సి.భవనంలో భద్రపరచనున్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో ప్రారంభించి పాఠశాలల్లో పిల్లలకి అందజేస్తామని, మిగిలిన ట్యాబులు కూడా త్వరలో వస్తాయని ఆమె వివరించారు.

బాలుర ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: ప్రాంతీయ బాలుర ఆటల పోటీలు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18,19 తేదీలలో ఉమ్మడి కృష్ణా జిల్లాలైన కృష్ణా, ఎన్.టి.ఆర్. జిల్లాలకు నిర్వహించగా, ఎ.ఎ.ఎస్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్.పాలిటెక్నిక్, గుడ్లవల్లేరు విద్యార్థులు బాలుర గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, బాలుర స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, గేమ్స్ స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ లతో పాటు, స్పోర్ట్స్ విభాగంలో తృతీయ సంవత్సరం విద్యార్ధి పి.వివేక్ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ ను దక్కించుకున్నాడు. బాలుర గేమ్స్ వాలీ బాల్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ మరియు చెస్ విభాగాలలో విన్నర్స్ గా నిలిచారు. అదేవిధంగా బాలుర స్పోర్ట్స్ విభాగంలో రన్నింగ్ విభాగంలో 200 మీ, 400 మీ, 800 మీ, 1500 మీ, 400 మీ ఐ 400 రిలే విభాగాలలో మొదటి స్థానం, 400 మీ ఐ 400 రిలే లో తృతీయ స్థానం, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో విభాగాలలో మొదటి స్థానం, జావెలిన్ త్రో విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించారు.

కులగణన సర్వే

విశాలాంధ్ర-ఘంటసాల: రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వే నిర్వహించనున్నట్లు తహసిల్దార్ బి రామా నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో టి అనూహ్య అధ్యక్షతన కుల గణన సర్వే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనూహ్య మాట్లాడుతూ జిల్లా స్థాయి జాయింట్ కలెక్టర్, కలెక్టర్ ఫాలోయింగ్ గా ఉంటూ వాలంటీర్లను ఉపయోగించి వాలెంటీర్ అప్లికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్వహించడం జరుగుతుందని దీనికి అన్ని వర్గాల వారిని పిలిపించి వారి వారి అభిప్రాయాలు సేకరించి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు అన్ని పార్టీల నాయకులు మాజీ సర్పంచ్ అందే జగదీష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

22లోపు రైతులు అభ్యంతరాలు తెలపాలి : ఏఓ

విశాలాంధ్ర-ఘంటసాల:- రైతు భరోసా కేంద్రాల్లో పంట నష్ట వివరాలు ప్రదర్శన ఇటీవల వచ్చిన మిచాంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల మండలంలోని దేవరకోట, ఘంటసాలపాలెం, తదితర గ్రామాలలోని ఆర్బికేల్లో మిచాంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతుల వివరాలను బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏవో మురళీ కృష్ణ మాట్లాడుతూ మిచాంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు, ఈదురు గాలులకు 33 శాతం కంటే పైన నష్టపోయిన వరి పంట వివరాలను వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో నమోదు చేయడం జరిగిందన్నారు. నమోదు చేసిన వివరాలను మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లోని నోటీసు బోర్డులో ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. ఆయా జాబితాల పై రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీ లోపు తగిన ఆధారాలతో ఆర్బీకే లోని వ్యవసాయ సహాయకులకు అందిస్తే మార్పులు, చేర్పులు చేయడం జరుగుతుందన్నారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 24వ తేదీన తుది జాబితాను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వారి ద్వారా కలెక్టర్‌కు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకోట సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, వేమూరి రాజేంద్రప్రసాద్, మూల్పూరి వెంకయ్య, వేమూరి సాయి వెంకటరమణ, విఏఏలు సత్యదేవ్, యూసఫ్ ఆలీ, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మల్లయ్య మృతి

విశాలాంధ్ర-పెడన : నిబద్ధతగల నాయకుడిని తెలుగుదేశం పార్టీ కోల్పోయిందని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. స్థానిక రామలక్ష్మి వీవర్స్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చెదుల్ల. మల్లయ్య(65) సంవత్సరాలు మంగళవారం అస్వస్థతకు గురై విజయవాడ ఆసుపత్రిలో మృతి చెందారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య, శివాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బళ్ల. ప్రసాద్,20 వ వార్డు మాజీ కౌన్సిలర్ యర్రా. నాగరాజు(రాజా), పేరక నాగేంద్రరావు, వార్త సుబ్రహ్మణ్యం, మేడక. కిషోర్ తదితరులు నివాళులర్పించారు.

రోడ్డుపై వంటావార్పుతో అంగన్‌వాడీల నిరసన

విశాలాంధ్ర-కూచిపూడి : తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని అంగన్వాడి సిబ్బంది తొమ్మిదవ రోజైన బుధవారం రోడ్డుపై వంటావార్పు నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ, సిఐటియుల పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ సమ్మెలో భాగంగా మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ ఘంటసాల చల్లపల్లి మండలాల లోని అంగన్వాడి సిబ్బంది సమ్మెలో భాగంగా వంటావార్పు నిర్వహించి అనంతరం బిక్షాటన కొనసాగించారు.. ఈ కార్యక్రమంలో సమ్మెకు అర్హులైన కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా కుటుంబాలు గడ్డితిని బతకాలా : అంగన్వాడీలు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె బుధవారం తొమ్మిదో రోజు ధర్నా కార్యక్రమంలో భాగంగా సమ్మె చేస్తున్న మాకు తిండి లేక గడ్డి తిని బతికే పరిస్థితి వచ్చింది అని చెప్పి పచ్చ గడ్డి కొరుకుతూ నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ ,ఆదాని లాంటి పెట్టుబడుదారులకి కారు సౌకగా తక్కువ రేట్లతో వేలాది ఎకరాలు దోసి పెడుతున్నారని దానివల్ల కొన్ని వేల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని అంగన్వాడీలకు వేతనాలు పెంచమని అడిగితే ప్రభుత్వ ఖజానాకి బొక్క వస్తుందని చెబుతున్నారని ఆగ్రహంవ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పెడన బంటుమిల్లి ,కృత్తివెన్ను మండలాల అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

పెంజెండ్రలో నీటి కుళాయిల ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని పెంజంద్రలో ప్రజల మంచినీటి సదుపాయం కోసం కేంద్ర రాష్ట్ర పభుత్వాల భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మంచినీటి కుళాయి కొరకు పైపు లైను వేయుటకు రూ.91 .00 లక్షలతో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. సి.పి. నాయకులు జితేంద్ర, సర్పంచ్ రేమల్లి తాతాబ్బాయి, ఉప సర్పంచ్ శ్రీ నాగరాజు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు శ్రీమతి పోలుకొండ వైదేహి, వార్డు మెంబర్లు , గ్రామ పెద్దలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ దారపు శ్రీనివాస్, ఆర్.డబ్ల్యూ.యస్. ఎ.ఇ. శ్రీ శివాజీ, ఎ.ఇ. పి.ఆర్. శ్రీ పృధ్విరాజ్ , పంచాయతీ కార్యదర్శి శ్రీ ఎం. గోవర్ధన రావు, కౌతవరం పంచాయతీ కార్యదర్శి శ్రీ సి.హెచ్. ఉమా మహేశ్వరరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, గన్నవరం గ్రామ కాపురస్తురాలైన అద్దేపల్లి శ్రీవిధ్య, భర్త: జాన్ ముల్లంగి గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు అద్దేపల్లి శ్రీవిధ్య గారికి విజయవాడ రెవిన్యూ వార్డు నెం.10, విజయవాడ మున్సిపల్ ఏరియా, విజయవాడ యన్.టి.ఆర్ డిస్ట్రిక్ట్, డోర్ నెం.41-28/7-65, బ్లాక్ నెం.11, యన్.టి.యస్ నెం.368/3 మరియు 369/1లోని యల్.పి.నెం.11/85, ఫ్లాట్ నెం.33, పాత అసెస్మెంట్ నెం.277130/1452ఏ/2, కొత్త అసెస్మెంట్ నెం.237481, ఎమెండ్‌మెంట్ నెం.3703/2016, తేది:19-5-2016, రిజిష్టర్డ్ డాక్యుమెంట్ నెం.2079/2029, తేది:27-02-2009 గా వటమట సబ్-రిజిష్ట్రార్ వారి కార్యాలయములో రిజిష్టర్ చేయించియున్నారు. సేల్‌డీడ్ ఒరిజినల్ డాక్యుమెంట్స్ బ్యాగ్ కవర్‌లో పెట్టుకుని గన్నవరం గ్రామము, గన్నవరం మండలం, కృష్ణా జిల్లా ది.25-11-2023న జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళి తీసుకొని వస్తున్నప్పుడు వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో చూసుకొనగా బ్యాగ్ మరియు బ్యాగ్‌లోని ఒరిజినల్ డ్యాక్యుమెంట్స్‌ను పోగొట్టుకొనడమైనది. చుట్టుప్రక్కల వారిని విచారించిన దొరకలేదు, ఎవ్వరికైనా దొరికినచో ఈ దిగువ అడ్రస్సుకు తెలియపరచినచో తగిన పారితోషికం ఇవ్వబడును.

ప్రదేశం: కోమటిగుంట
తేది : 20-12-2023

ఇట్లు: బి.రామారావు
న్యాయవాది/నోటరి
డోర్ నెం.7-35, కోమటిగుంట గ్రామము,
కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా,
ఏ.పి-521260

భారత్ సంకల్ప యాత్ర జయప్రదం చేయాలి : ఎంపీడీఓ

విశాలాంధ్ర-పమిడిముక్కల: విక్షిత్ భారత సంకల్ప యాత్ర ఈ నెల 22వ తేది నుండి జనవరి 3 వరకు ఆయా గ్రామాల లో జరుగు యాత్ర లో భారత ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్దిదారులు ను యాత్ర లో పాల్గొనేటట్లు చేయ్యాలని యంపిడిఓ విఠల్ పాల్ తెలిపారు.బుధవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ విక్షిత్ భారత సంకల్ప యాత్ర 22న మంటాడ 23న గురజాడ, తాడంకి 24న గోపువానిపాలెం, మర్రివాడ 25న కపిలేశ్వరపురం,వీరంకి 26న అమీనపురం, ఫత్తేలంక 27న అగినపర్రు మామిళ్ళపల్లి 28న కృష్ణాపురం పెనుమత్స 29న చోరగుడి అలినఖీపాలెం 30న లంకపల్లి శ్రీరంగపురం 31న ఐనపూరు కూడేరు జనవరి 1న మేడూరు పమిడిముక్కల 2న ఐనంపూడి ముళ్ళపూడి 3న వేల్పూరు హనుమంతపురం గ్రామాలలో యంజిఎన్ఆర్జిస్, వెలుగు శాఖ, వ్యవసాయ శాఖ గృహ నిర్మాణ శాఖ నీటిసరఫరా శాఖ ఆరోగ్య శాఖ విద్యా శాఖ రెవిన్యూ సివిల్ సప్లయ్స్ పశుసంవర్ధక మండల సర్వేయర్ లు ఆయా శాఖల ద్వారా లబ్ది పొందిన లబ్దిదారులు లను సదరు కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేయాలని యంపిడిఓ తెలిపారు.

ఎంఈఓ కార్యాలయం మూసివేత

విశాలాంధ్ర-పెడన : సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు రెగ్యులర్ చేయాలని దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ ఎస్ ఎస్ ఏ ఉద్యోగులు బుధవారం సమ్మెలోకి దిగడంతో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం మూతపడింది

మహిళకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్థానిక నిజాం పేట లో నివసిస్తున్న ఒక మహిళకి వివాహం అయి ఏడు సంవత్సరాలు అవుతుంది. ఇద్దరు పిల్లలు సంతానం.భర్త చెడు వ్యసనాలకు లోనై కుటుంబాన్ని పట్టించుకోకపోవడమే కాకుండా బాధిత మహిళను, పిల్లలని కూడా వదిలి వదిలివెళ్లిపోవడం జరిగింది. స్కూల్ ఫీజులు కట్టలేకపోవడం కారణంగా పిల్లలు కూడా ఇంటివద్దనే ఉంటున్నారు.ఇల్లు కూడా గడవక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆ మహిళ కుటుంబానికి మైత్రీ ఫౌండేషన్ ద్వారా 10,000 ఆర్థిక సాయం,నిత్యావసర సరుకులును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కె. వేణు కుమార్,ఉపద్యక్షులు గంగయ్య నాయుడు, కార్యదర్శి రాధాకృష్ణ సభ్యులు చెంచయ్య, రమేశ్, నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ : అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహిళా సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల నిరవధిక సమ్మె నేపథ్యంలో వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక లెనిన్ సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను బలవంతంగా చట్ట వ్యతిరేకంగా తెరిపించి నడిపించే అణచివేత ధోరణిని ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. జగన్ మాట తప్పని వాడని రుజువు చేసుకోవాలన్నారు. పనికి, ఉద్యోగాలకు వెళ్లే, తల్లుల బిడ్డల సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మహిళా సంఘాలు చేసిన ఆందోళన ఫలితంగానే అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పని చేసే మహిళలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలన్నారు. వారిని కార్మికులుగా గుర్తించకపోవడం, చట్ట ప్రకారం రావలసిన సదుపాయాలు లేకపోవడం ,సెలవులు లేకపోవడం చివరకు మాతృత్వపు సెలవులు కూడా లేకుండా పనిచేయాల్సి రావడం మన సమాజ దౌర్భాగ్యానికి నిదర్శనమన్నారు .ఇప్పుడు కూడా కనీస వేతనాలు వారు డిమాండ్ చేయడం లేదు! దానికి భిన్నంగా ప్రభుత్వం ఇచ్చినటువంటి వాగ్దానాన్ని అమలు చేయమని కోరుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రకటనలో చెప్పిన విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయమని, సుప్రీంకోర్టు తీర్పుని గౌరవించమని కోరుతున్నారని తెలిపారు. ఈ డిమాండ్లను పరిష్కరిస్తూ, అంగన్‌వాడీ లకు సంఘీభావం ప్రకటిస్తూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ లెనిన్ సెంటర్ లో ధర్నా నిర్వహించి అనంతరం ప్రదర్శనగా ధర్నా చౌక్ లో ధర్నా చేస్తున్న అంగన్‌వాడా కార్యకర్తల శిబిరానికి వెళ్లి మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వారిపట్ల అనుసరిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసే ప్రచార యంత్రాలుగా పావులుగా అంగన్‌వాడీ కార్మికులను వాడుకొని,చివరకు వారికి కనీస వేతనం కూడా ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటూ, సంక్షేమ పథకాలు కూడా వారి కుటుంబాలకు వర్తించకుండా చేస్తున్నారని, కనీస వేతనం, గ్రాట్యుటీ ఇవ్వాలని, నాణ్యమైన మెనును పెంచి ఇవ్వాలని, తదితర అంశాల మీద వారు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని, వారిపై వేధింపులకు పాల్పడటం ఆపివేయాలని, తక్షణం వారికి న్యాయం చేయాలని కోరుతూ,వారి పోరాటం విజయవంతం అయ్యేవరకు అండగా వుంటామని,రోజు రోజుకు వారి పోరాటానికి ప్రజల ,ప్రజాసంఘాల, కార్మిక సంఘాల వారి మద్దతు పెరుగుతుందని ,ప్రజలు ఆగ్రహానికి గురి కాకముందే ప్రభుత్వం సరు అయిన నిర్ణయం తీసుకుని వీరికి న్యాయం చేయాలని లేని పక్షం లో తరువాత జరగబోయే పరిణామా లకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స దుర్గాభవాని (ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య) రమాదేవి(ఐద్వా), రాగి గంగాభవాని, (ప్రగతిశీల మహిళా సంఘం), సుంకర పద్మశ్రీ (మహిళా కాంగ్రెస్), ఆర్.నాగమణి(ఐద్వా) తదితరులు మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో కే.శ్రీదేవి, ఓర్సు భారతి, డి.సీతారావమ్మ,దుర్గా సి రమణమ్మ, భాగ్యలక్ష్మి, శాంత, పద్మ, దుర్గ జ్యోతి,ఖుషీద, నగర మహిళా సమాఖ్య నాయకులు ఓర్సు భారతి, డి..సీతారావమ్మ, డి.రమణమ్మ, బి..ఝాన్సీ లక్ష్మి, ఎం..ఇందిర, బి.శాంత, ఎస్..భాగ్య లక్ష్మి, రాజ్య లక్ష్మి తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

‘పశ్చిమ’ వైసీపీ సీటుపై ఫీట్లు!

- అధికార పార్టీ టికెట్ ఎవరికిస్తారనే విషయంపై ఉత్కంఠ
- సిట్టింగ్ ఎమ్మెల్యేకు చాన్స్ లేదని జోరుగా ప్రచారం
- మేయర్‌కు సీటు ఇస్తారని సోషల్ మీడియాలో హల్‌చల్
- తెరపైకి ఓ కాలేజీ అధినేత పేరు..
- వైసీపీలో రాజకీయాలను గమనిస్తున్న మైనారిటీలు, ఎస్సీలు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై వైసీపీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించడంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోనూ రాజకీయం వేడెక్కింది. అధికార పార్టీ అభ్యర్థి ఎవరనే అంశంపై తీవ్ర ఉత్కంఠత నెలకొంది. అదే సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు చాన్స్ లేదని, ఆయన సూచించినవారికి ఖరారు చేశారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. మరోవైపు వైసీపీ అధిష్ఠానం ఓ మైనారిటీ విద్యాసంస్థల అధినేతను పోటీకి సిద్ధం చేస్తోందనే వార్త కూడా నియోజకవర్గంలో హల్‌చల్ చేస్తోంది. వాస్తవానికి ఇప్పటి వరకు వైసీపీ అధిష్ఠానం ఎవరి పేరుపై స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న మైనారిటీలు, ఎస్సీలు తాజా రాజకీయ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నారు.

ముందుగానే వెలంపల్లి పేరు ప్రకటించిన సజ్జల.. ఇప్పుడు బ్రేక్‌లు!

రెండు నెలల కిందట కేటీ రోడ్డు, గణపతిరావు రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు 2024లోనూ పోటీ చేస్తారని, గెలిపించాలని ప్రభుత్వ సలహాదారు, వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. అయితే, అనూహ్యంగా రెండు నెలల్లోనే పరిణామాలు మారిపోయాయి. పలుమార్లు సర్వేలు చేయించిన వైసీపీ అధిష్ఠానం వెలంపల్లికి సీటు ఇస్తే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సీటు ఇవ్వడం సాధ్యం కాదని వెలంపల్లిని అదే సజ్జల రామకృష్ణారెడ్డి పిలిచి బుజ్జగించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కనీసం తాను చెప్పినవారికైనా సీటు ఇవ్వాలని వెలంపల్లి కోరారని, పశ్చిమ సీటును మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ఇవ్వాలని, ఆమెకు ఇవ్వకపోతే కనీసం మరో మహిళా కార్పొరేటర్‌కు అయినా ఇవ్వాలని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు మళ్లీ వెలంపల్లికే సీటు వస్తుందని ఆయన అనుచరులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.

మైనారిటీలకు అవకాశం దక్కేనా...

పశ్చిమ ఎమ్మెల్యే సీటుపై వైసీపీ మైనారిటీ నేతలు కూడా ఆశలు పెట్టుకుని ఉన్నారు. జగన్‌కు మొదటి నుంచి బలమైన ఓటు బ్యాంక్‌గా ఉన్న మైనారిటీలకు ఈసారి పశ్చిమ సీటు ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. వైసీపీ ఆవిర్భావం నుంచి ఉన్న స్థానిక నాయకుడు ఆసిఫ్, మరో ఇద్దరు మైనారిటీ నాయకులు కూడా తమకు సీటు ఇవ్వాలని వైసీపీ అధిష్ఠానానికి వినతిపత్రాలు పంపారు. వాటిని కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఓ మైనారిటీ విద్యావేత్త, ప్రముఖ మైనారిటీ విద్యాసంస్థల అధినేత పేరు తెరపైకి వచ్చింది. సీఎం జగన్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆయనకు దాదాపు టికెట్ ఖరారు చేసినట్లు కూడా కొందరు నియోజకవర్గంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఆ ప్రతిపాదనపై మైనారిటీ, ఎస్సీ నేతల్లో అసంతృప్తి

నియోజకవర్గంలో సుమారు 2.4లక్షల ఓటర్లు ఉండగా, అత్యధికంగా 55వేల వరకు ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత ఎస్సీలు 50 వేలు, నగరాలు 25వేలు, కాపులు 25వేల వరకు ఓటర్లు ఉండవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో తనకు మళ్లీ సీటు ఇవ్వాలని, లేకపోతే మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ఇవ్వాలని వెలంపల్లి శ్రీనివాసరావు ప్రతిపాదన చేశారనే ప్రచారంపై మైనారిటీ, ఎస్సీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే నగర మేయర్ పదవి ఓసీ మహిళకు రిజర్వు అయినా తొలిసారి కార్పొరేటర్ అయిన బీసీ మహిళకు ఇచ్చారని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కూడా మళ్లీ నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు ఉన్న ముస్లింలు, ఎస్సీలను పక్కన పెట్టి మేయర్‌కే ఎమ్మెల్యే సీటు ఎలా ఇస్తారని వైసీపీలోనే కొందరు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయంపై మైనారిటీ, ఎస్సీ నేతలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

పశ్చిమ నుంచి నేనే పోటీ చేస్తా.. వెలంపల్లి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి నేనే పోటీ చేస్తానని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో సీటు రాదని, రాజీనామా చేస్తున్నామని అసత్యప్రచారాలు సృష్టి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీస్సులతో తానే పోటీ చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల పై సెక్రటరీలోని అధికారులు కలిసి వస్తే సీటు లేదని, సీటు మారుస్తున్నారని రకరకాల వార్తలు వేస్తున్నారన్నారు. సీటు వ్యవహారం పై ఇప్పటి వరకు పార్టీ అధిష్ఠాం ప్రస్తావించలేదన్నారు. వెస్టను నుంచి వెలంపల్లి, సెంట్రల్ నుంచి మల్లాది, తూర్పు నుంచి దేవినేని అవినాష్‌లు ఉంటామన్నారు. నగర అభివృద్ధికి అందరం కలిసి పనిచేస్తున్నామన్నారు.నగరంలోని మూడు నియోజకవర్గాలు గెలిపించి జగన్‌కు ఇస్తామన్నారు. సోషల్ మీడియాలో అసత్యప్రచారాలు రాయడం మానుకోలవాన్నారు.

మసాజ్ ముసుగులో

అసాంఘిక కార్యకలాపాలు

- విజయవాడలోని రెండు స్పా సెంటర్లలో పోలీసుల సోదాలు
- దొరికిన 17 మంది యువతులు, 10మంది విటులు
- యువతుల్లో 15 మంది ఢిల్లీ వారే...

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: నగరంలోని పలు స్పా సెంటర్లలో మసాజ్ పేరుతో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఖరీదైన స్పా సెంటర్లు ఏర్పాటుచేసి ఢిల్లీ వంటి నగరాల నుంచి అందమైన యువతులను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు అందిన సమచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సమయంలో బందరు రోడ్డులోని కేఎఫ్ సీ సమీపాన ఉన్న ట్రాంక్విల్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించి తొమ్మిది మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు విటులను అరెస్ట్ చేశారు. అదేవిధంగా బందరు రోడ్డులోనే చైతన్య కాలేజీ పక్కన ఉన్న సిరి స్పా సెంటర్‌లో తనిఖీలు చేసి ఎనిమిది మంది యువతులు, ముగ్గురు విటులను పట్టుకున్నారు. పోలీసులకు పట్టుబడిన 17 మంది యువతుల్లో 15 మంది ఢిల్లీకి చెందినవారే ఉన్నట్లు సమాచారం. మరో ఇద్దరు ఒంగోలు యువతులు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు స్పా సెంటర్ల నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. యువతులను పటమటలోని మహిళా హోమ్‌కు తరలించారు.

విద్యాదోపిడీని అరికట్టాలి

విశాలాంధ్ర-వత్సవాయి : విద్య ప్రైవేటీకరణ వ్యాపారం అరికట్టాలని, కేజీ నుండి పీజీ వరకు అందరికీ ఉచిత విద్య అందించాలని, విద్యా వైద్య రంగాల్లో వ్యాపారం అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జగ్గయ్యపేట నియోజకవర్గ మహాసభను బుధవారం జగ్గయ్యపేట పట్టణంలోని ఉక్కు కళాభవన్లో జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఎం సాయికుమార్ అధ్యక్షతన మహాసభను నిర్వహించారు. మొదటగా దోనేపూడి శంకర్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆవిష్కరణ అనంతరం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమ కాలంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల సాధన సమస్యల పరిష్కారం కోసం భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు చేగువేరా వంటి విప్లవకారుల స్ఫూర్తితో 1936 ఆగస్టు 12న శాస్త్రీయ సోషలిజం అనే నినాదంతో ఆనాటి నుండి నేటి వరకు దాదాపు 90 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల సాధన కోసం ఉద్యమాలు సాగిస్తున్న చరిత్ర ఉందని అన్నారు. శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలని విద్యా ప్రవేటీకరణ వ్యాపారం అరికట్టాలని కేజీ నుండి పీజీ వరకు అందరికీ ఉచిత విద్య అందించాలని విద్యా వైద్య రంగాల్లో వ్యాపారం అరికట్టాలని టీచర్లు అధ్యాపకులు పోస్టులు భర్తీ చేయాలని కళాశాలల స్థాయిలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కళాశాలలో ర్యాగింగ్ ను అరికట్టాలని ప్రైవేటు రంగం ఉద్యోగ ఉపాధిలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలకు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నాల శివారెడ్డి ప్రసంగిస్తూ కేంద్రంలో పాలక బీజేపీ ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో ఎన్ఈఆర్టీ సిలబస్ నుండి తన ఆర్ఎస్ఎస్ భావజాలంతో మొగల్ చరిత్ర భగత్‌సింగ్ డార్క్ ఇన్ సిద్ధాంతాలను తొలగించి రామాయణం భారత ఇతిహాసాలు జ్యోతిష్యం భగవద్గీత వాస్తు వంటి అశాస్త్రీయ పాఠ్యాంశాలు చూపిస్తున్నారని అన్నారు. సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ మాట్లాడుతూ మన రాష్ట్రంలో కూడా పాలక ప్రభుత్వాలు ప్రైమరీ విద్యను ఉన్నత విద్యలో విలీనం చేయడం విద్యాసంస్థల రద్దు మాతృభాషలో విద్యా బోధన కాకుండా ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం వంటి చర్యలు తీవ్రంగా ఖండించారు. మెడికల్ మరియు ఇంజినీరింగ్ కోర్సుల్లో లక్షల రూపాయల ఫీజులు దోపిడీ అరికట్టాలని ప్రైవేటు విద్యాసంస్థల్లో సాగుతున్న వ్యాపార ధోరణి అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ధోరణి మార్చుకోకపోయినట్లయితే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉధృత స్థాయిలో ఉద్యమాలు చేసి విద్యార్థులకు అండగా నిలబడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, సీపీఐ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా విధానాన్ని దోపిడీకే పరిమితం చేయడం ప్రభుత్వం యొక్క నిరంకుశత్వ ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ అరుణ్‌కుమార్, మాజీ నాయకులు పట్టణ సహాయ కార్యదర్శి మహమ్మద్ అసుదుల్లా, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ఎంద్రపల్లి భాను భారీ స్థాయిలో విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక :

ఈ కార్యక్రమంలో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ గౌస్‌పాషా, ఉపాధ్యక్షులుగా ఎం తరుణ్, ఆర్ సంపత్, కె విష్ణు, కార్యదర్శిగా పి రాకేష్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా షేక్ సాయిబాబా, అవినాష్ అబ్దుల్లా కోశాధికారిగా ఏం సంజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉత్సాహంగా ప్రజానాట్యమండలి ‘ఆట-పాట, మాట’

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో బుధవారం భవానీపురం శివాలయం సెంటర్‌లో ‘ఆట-పాట, మాట’ కార్యక్రమం ఘనంగా జరిగింది. ‘కళ కళ కోసం కాదు- కళ ప్రజల కోసం’ నినాదంతో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు నుంచి విజయవాడ వరకు చేపట్టిన పాదయాత్ర ముగిసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారుల పాదయాత్ర ప్రకాశం బ్యారేజీ నుంచి విజయవాడ నగరంలోకి ప్రవేశించి భవానీపురం వరకు సాగింది. బ్యారేజీ వద్ద సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్వర్యంలో నగర సమితి, ప్రజానాట్యమండలి విజయవాడ నగర సమితి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సభా వేదికపై కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు నవ్వులు కురిపించాయి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమపథకాల్లో లోపాలు, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు తదితర అంశాలపై లఘునాటికలు ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు అలరించాయి. కళాకారులు పాటలు, ఆటలు, మధ్యమధ్యలో నాయకుల ప్రసంగాలతో సభా ప్రాంగణం ఉత్తేజితమైంది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యవర్గసభ్యులు కేవీ భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, స్థానిక డివిజన్ కార్యదర్శి పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రేక్షకులు ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన లఘునాటికలను తిలకించి కరతాళ ధ్వనులతో అభినందించారు.

సంక్షేమ వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కంచికచర్ల : ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐయస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పుటూరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కాస్మోటిక్ ఛార్జీలు పెరిగిన నిత్యవసర ధరలుకు అనుగుణంగా పెంచాలని అఖిల కోరారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నందిగామలోని సాంఘిక సంక్షేమ మరియు వెనుకబడిన సంక్షేమ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేశామని ప్రగల్భాలు పలుకుతున్నటు వంటి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు దుస్థితిని గమనించలేరని ప్రశ్నించారు. నందిగామ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని సరైనటువంటి టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని ఎన్నిసార్లు చెప్పినా వార్డులు అధికారులు స్పందించక పోవడం దారుణమని హాస్టల్ భవనాలు కూలేటటువంటి స్థితిలో ఉండి పెచ్చులు ఊడి పడుతున్నాయని చలి కాలము కిటికీలు సరిగ్గా లేక దోమల బెడద ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని చుట్టూ విపరీతమైన టువంటి దోమలు పురుగులు,పాముల తో భయంకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని విద్యార్థులు ఈ సందర్భం గా ఏఐఎస్ఎఫ్ నాయకులకు తెలియ జేశారు.పెరిగిన నిత్యవసర ధరలను దృష్టిలో ఉంచుకొని కాస్మటిక్ చార్జీలను పెంచవలసినటువంటి ప్రభుత్వం పాత పద్ధతిలోనే పాత రేట్లకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలను ఇవ్వడం సరికాదని అన్నారు.ఏఎస్ఎఫ్ నందిగామ నియోజక వర్గ నూతన కమిటీ ఎన్నిక అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గా వి.పుల్లయ్య, గూడూరు రామకృష్ణ, ఉపాధ్యక్షులు గా జి. వంశీకృష్ణ ఎస్కే.ఖాజావలి టి. వెంకటకృష్ణ,సహాయ కార్యదర్శిలు గా షేక్ బిలాల్, ఐ.ఉదయ్,జి.ఏసుబాబు కోశాధికారిగా అభినవ్ లను ఎన్నుకోవడం జరిగిందని ఉప్పుటూరి అరుణ్ కుమార్ తెలిపారు.

ప్రకటన

అన 2023వ సం. డిసెంబర్ నెల 18వ తారీకున నా క్లయింటు అయినటు వంటి N.T.R. Dist. విజయవాడ, డోరు నెం.30-9-7, దుర్గాఅగ్రహారం, సంబారి వారి వీధి, కాపురస్తులు బూసా వీరారెడ్డి గారి భార్య బూసా మల్లీశ్వరీ గారి యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా,

నా క్లయింటు లోగడ కృష్ణాజిల్లా విజయవాడ సిటీ, దుర్గాఅగ్రహారం వీధి, డోర్ నెం. 30-7-15, అనపర్తి వారి వీధి కాపురస్తులు పగడాల నాగభూషణం గారి కుమారుడు పగడాల శంకర మెహర్ బాబా గారు శేతలి పద్మావతి గారి తరపున స్థిరాస్తి అస్వాధీన విక్రయ ఎగ్రిమెంట్‌తో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ వారి నుండి ది. **27.04.2011న** దస్తావేజు నెం. **1672/2011**గా క్రయం పొందియున్నారు. దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్స్ నెం. **3629/2006 మరియు ద.సెం. 3313/2006** సబ్ రిజిస్ట్రారు ఆఫీస్ గుణదల ఒరిజినల్ అస్వాధీన విక్రయ ఎగ్రిమెంట్‌తో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ డీడ్స్ నాక్లయింట్ సదరు దస్తావేజులను జిరాక్స్ తీయుటకు తన నివాసమయిన దుర్గాఅగ్రహారము నుండి క్రీస్తులంకకు సెంటర్ తీసుకొని వెళ్ళుచున్నపుడు మార్గమధ్యలో పైన ఉదహరించిన రెండు ఒరిజినల్ దస్తావేజులు పోయినవి అని తెలిపియున్నారు. నా క్లయింట్ క్రీస్తులంక పోలీస్ స్టేషన్ నుండి మిస్సింగ్ లాస్ట్ డాక్యుమెంట్ సర్టిఫికెట్ నెం. **1520285191120**, ది. **19.11.2020**, తీసుకొనియున్నారు. కావునా సదరు డాక్యుమెంటు ఏవేవరికైనను దొరికిన యెడల ఈ దిగువ తెలిపిన అడ్రసుకు స్వయముగా కాని, రిజిష్టరు పోస్ట్ విత్ ఎక్నాలెడ్జిమెంట్ ద్వారా కాని అందజేయగలరు. అయితే సదరు డాక్యుమెంటు దొరికిన వారు నా క్లయింట్లు యొక్క హక్కులకు వ్యతిరేకముగా ఉపయోగించిన యెడల నా క్లయింట్లు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురని ఇందుమూలముగా తెలియ జేయుటమైనది. మరియూ నా క్లయింట్లు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఋణము పొందు నిమిత్తం, బ్యాంకులను సంప్రదించుట జరుగుచున్నది. కనుక ఈ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఎట్టి క్లెయిములు గాని, అభ్యంతరములు గాని ఉన్న యెడల ఈ దిగువ అడ్రసుకు ప్రకటన తేదీ నుండి వారం రోజులలోపు వ్రాత పూర్వకంగా తెలియజేయవలెను. దరిమిలా వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవన్నీ మరియూ ఈ ఆస్తిని నిష్పేచీగా భావింతురని ఇందుమూలముగా తెలియజేయటమైనది. **ఐటమ్ నెం.1) ద.నెం.3629/2006**

షెడ్యూలు: కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన దుర్గాఅగ్రహారం, అనపర్తివారి వీధిలోని డోరు నెం.30-7-15, పాత అసెస్మెంటు నెం. 22162, న్యూ అసెస్మెంటు నెం. 186966, యస్.టి.యస్.నెం.668ర్లు, దాఖలా ఆస్తికి **హద్దులు: తూర్పు :** శేతలి విజయలక్ష్మి గారు యితరులకు విక్రయించిన ఆస్తి, **దక్షిణం :** అరిగేపల్లి వెంకటశాస్త్రి గారి ఆస్తి, పడమర : మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** ఆ 9.3 లు వెడల్పు గల జాయింటు రోడ్డు యీ హద్దుల మధ్య చ.గ. 185.27 లు లేక చ.మీ. 154.90క్షు స్థిరాస్తి నివేశన స్థలములో అనిర్దిష్టపు అవిభాజ్యపు జాయింటు హక్కు చ.గ. 20లు స్థలమున్నూ, స్థలము అందుగల యావత్తు ఈజ్మెంట్ హక్కులతో సహా.

బి-షెడ్యూలు - గ్రౌండ్, ఫస్టుఫ్లోర్లుగా గల ఆర్.సి.సి. బిల్డింగులో ఫస్టు ఫ్లోరులో నిర్మించిన ఎఫ్.ఎఫ్.2 కు **హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. ఎఫ్-1 దాఖలా కోట కాశీ కృష్ణభగవాన్ గారి ఆస్తి, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** యీ రోజున మీతోపాటు సోమిశెట్టి సాంబశివరావు గారికి విక్రయ ఖరారు పరచిన ఫ్లాటు నెం. ఎఫ్. ఎఫ్. 3 రు ఫ్లాట్, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై యీ హద్దుల మధ్య చ.అ. 380లు ప్లింతేరియా గలిగిన ఫ్లాట్, చ.అ. 107లు ప్లింతేరియాగల కామన్ ఏరియా, సదరు ఫ్లాట్కు అమర్చిన యావద్విశిష్ట కలప సామానులు, కరెంటు ఫిట్టింగ్స్, సర్వీసు మీటరు, సహా అందుగల యావత్తు ఈజ్మెంట్ హక్కులతో సహా.

ఐటమ్ నెం.2) ద.నెం.3313/2006 షెడ్యూలు : కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన దుర్గాఅగ్రహారం, అనపర్తివారి వీధిలోని డోరు నెం.30-7-15, పాత అసెస్మెంటు నెం.22162, న్యూ అసెస్మెంటు నెం. 186966, యస్.టి.యస్.నెం.668ర్లు, దాఖలా ఆస్తికి **హద్దులు : తూర్పు :** శేతలి విజయలక్ష్మి గారు యితరులకు విక్రయించిన ఆస్తి, **దక్షిణం :** అరిగేపల్లి వెంకటశాస్త్రి గారి ఆస్తి, **పడమర :** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** ఆ 9.3 లు వెడల్పు గల జాయింటు రోడ్డు - హద్దుల మధ్య చ.గ. 185.27 లు లేక చ.మీ. 154.90 ర్లు స్థిరాస్తి నివేశన స్థలములో అనిర్దిష్టపు అవిభాజ్యపు జాయింటు హక్కు చ.గ.20 లున్నూ, షాపు నిమిత్తం అ.అ. జాయింటు హక్కు చ.గ.05 లున్నూ, ఫస్టు ఫ్లోరుపై ఓపెన్ టెర్రస్పై మీకు కలుగజేసిన హక్కు నిమిత్తం అ.అ. జాయింటు హక్కు గల చ.గ. 60లున్నూ వెరశి మొత్తం చ.గ. 185.27లులో అనిర్దిష్టపు అవిభాజ్యపు జాయింటు స్థలము అందుగల యావత్తు ఈజ్మెంట్ హక్కులతో సహా.

బి-షెడ్యూలు - గ్రౌండ్, ఫస్టుఫ్లోర్లుగా గల ఆర్.సి.సి. బిల్డింగులో ఫస్టు ఫ్లోరులో నిర్మించిన పోర్షనుకు **హద్దులు : తూర్పు :** ఈరోజున మీతోపాటు సోమిశెట్టి సత్యనారాయణగారికి విక్రయఖరారు పరిచిన ఆస్తి, **దక్షిణం :** ఈ బిల్డింగ్ ప్రహరీ గోడ వెంబడి అరిగేపల్లి వెంకటశాస్త్రి గారి ఆస్తి, పడమర : 2వ ఐటం ఆస్తి కొంత, మెట్లు కొంత, **ఉత్తరం :** ఆ 9.3 లు వెడల్పు గల జాయింటు రోడ్డు.

M. DURGA PRASAD, Advocate
B.Com, L.L.B
14-2011, Beside Guruhotel, Gandhinagar,
Vijayawada - 520 003.
Cell: 7799828717

తేది. 18.12.2023

అయ్యప్ప కుటుంబానికి అండగా వైయస్సార్ బీమా

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): విజయవాడ కేఎల్ రావు నగర్ ప్రాంతంలో నివాసముండే వర్గం అయ్యప్ప(35) చనిపోయారు. స్థానిక 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగా అయ్యప్ప మరణ వార్త తెలుసుకొని, మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వివరాలు తెలుసుకోగా అయ్యప్ప రోజువారి కూలిని పనులతో కుటుంబ జీవనం సాగిస్తుండగా తీవ్ర అనారోగ్యంతో సోమవారం మృతి చెందారని తెలిపారన్నారు. వైయస్సార్ బీమా పథకం ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలను నగదును నామిని అయిన వర్గం స్వర్ణ లక్ష్మికి కార్పొరేటర్ గోదావరి గంగా, సచివాలయం ఇన్చార్జి తో కలసి అందచేశారని తెలిపారు.

23న చిట్టా దీపక్ గాత్ర కచేరి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23వ తేదీ శనివారం సాయంత్రం చిట్టా దీపక్ గాత్ర సంగీత కచేరి జరుగుతుందని సమితి ప్రధాన కార్యదర్శి సి వి రావు తెలిపారు. స్టార్ హాస్పిటల్స్, ఘంటసాల సంగీత నృత్య కళాశాలల సౌజన్యంతో ఈ కార్యక్రమం ఘంటసాల సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలోని కళావేదికపై జరుగుతుందని తెలిపారు. సంగీతాభ్యాసకులు, సంగీత విద్వాంసులు, సంగీత ప్రియులు, పోషకులు కార్యక్రమానికి విచ్చేసి కళాకారులను ప్రోత్సహించవలసిందిగా కోరారు.

ఆకట్టుకున్న క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ యాజమాన్యం నిర్వహించిన వార్షిక క్రీడా దినోత్సవ సంబరాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఇబ్రహీంపట్నంలోని విటిపిఎస్‌ఏ కాలనీ గ్రౌండ్ లో బుధవారం గుంటూరు ఆక్స్ఫర్డ్ స్కూల్ ఇబ్రహీంపట్నం బ్రాంచ్ ప్రిన్సిపల్ యల్లమందరావు ఆధ్వర్యంలో వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా కొండపల్లి మునిసిపల్ కమిషనర్ శ్రీ.వెంకటేశ్వర్లు , ప్రత్యేక అతిథి గా గుంటూరు ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీ.విజయ్ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. లాంగ్ జంప్, షాట్ పుట్, రన్నింగ్ మొదలగు పోటీలను నిర్వహించి , బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుతోపాటు క్రీడలను కూడా ఆస్వాదించాలని గుంటూరు ఆక్స్ఫర్డ్ యాజమాన్యం విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించడం గర్వించదగిన విషయము అన్నారు. విద్యార్థులు కూడా మంచి చదువుతోపాటు క్రీడలను కలిగి ఉండాలని తాము చదువుకుంటున్న స్కూలుకు తల్లిదండ్రులకు మంచి పేరును సంపాదించాలని విద్యార్థులను కోరారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు : ఎంపీపీ

విశాలాంధ్ర-కంచికచర్ల: మండలంలోని పెండ్యాల గ్రామంలో జగనన్న కాలనీలో మౌలిక వసతులు పునరుద్ధరిస్తున్నా మని లబ్దిదారులు ఇల్లు నిర్మాణాలు చేపట్టి సొంతింటి కలను నెరవేర్చుకోవా లని బుధవారం ఎంపీపీ మలక్ బషీర్ అన్నారు. పెండ్యాల గ్రామంలో జగనన్న కాలనీలో బోర్లు, రహదారులను పరిశీలించి కంపచెట్ల తొలగింపు పనులు జెసిపి సహాయంతో చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జగనన్న కాలనీలో స్థలాలు పొందినటువంటి లబ్దిదారులు ఇల్లు నిర్మాణాలు చేపట్టేందు కు కంపచెట్లు దట్టంగా పెరిగాయని బోర్లు కొన్ని పనిచేయడం లేదని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు,ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ లు జగనన్న కాలనీ పరిశీలించి అక్కడున్న సమస్యలపై అధికారులు తో చర్చించి వెంటనే మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారన్నారు.జగనన్న కాలనీలో పేదలకు 610 ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని వాటిలో కొంతమంది గృహప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారని, కొన్ని గృహాలు పైకప్పు వరకు, కొన్ని గృహాలు బేస్మెంట్ లో ఉన్నాయన్నారు.జగన్ అన్న కాలనీలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని లబ్దిదారులు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీపీ మలక్ బషీర్ పిలుపునిచ్చారు.ఇళ్ల స్థలాలు పొంది నటువంటి లబ్దిదారులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కల్పించి నీటి సౌకర్యం కల్పించే విధంగా బోర్లతో పాటు చిన్నపాటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు.నీటి సౌకర్యం కల్పించిన తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని లబ్దిదారులు తెలిపారు.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.23-12-2023 శనివారం ఉ॥ 11 గం॥లకు ప్రకాష్‌నగర్ బ్రాంచి నందు 1052.00 గ్రాములు మరియు రామవరప్పాడు బ్రాంచి నందు 855.00 గ్రాములు కుదవ పెట్టిన పాత బంగారు నగలు మా హెడ్ ఆఫీస్ నందు వేలం వేయబడుచున్నవి. వేలం వేయబడుచున్న నగలు వినియోగదారుల సమయం దాటిపోయి నందున, వారందరికి మా వేలం పాట ప్రకటనలు రిజిష్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగినది. వేలం పాటలో పాల్గొనే వ్యక్తి తమ అడ్రస్ ప్రూఫ్ & ఐ.డి.ప్రూఫ్ వెంటతీసుకుని రావలెను. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి వుంటుంది. నిబంధనల కొరకు దయచేసి మా హెడ్ ఆఫీసు నందు సంప్రదించగలరు.

H.O.అరుణా ఫైనాన్స్ లిమిటెడ్
డోర్ నెం. 59-2-1/2, మొదటి అంతస్తు,
అమ్మ ఫంక్షన్ హాల్, అశోక్‌నగర్, విజయవాడ-10.
సెల్: 88851 22377

సెమీ క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లు భేష్

జిల్లా అధికార యంత్రాంగానికి క్రిస్టియన్ మత పెద్దలు, సోదరసోదరీమణుల ప్రశంస

విశాలాంధ్ర-విజయవాడ : విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో అత్యంత ఘనంగా జరిగి, విజయవంతంగా ముగిసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు చేసిన ఏర్పాట్లు భేష్ అంటూ క్రిస్టియన్ మతపెద్దలు, క్రిస్టియన్ సోదర సోదరీమణులు ప్రశంసించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు నేతృత్వంలో జిల్లా అధికార యంత్రాంగం చేసిన పటిష్ట ఏర్పాట్లు చాలా బాగున్నాయంటూ బిషప్ జాషువా అదానీ, హనోక్, దయానిధి, అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కమ్యూనిటీ ప్రతినిధులు ఎం.బుజ్జిబాబు, రెవ్ కరుణానిధి, రెవ్ ఎస్.శ్రవణ్ కుమార్, యు.ఇశ్రాయెల్ తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చర్చి ఫాదర్లు, క్రైస్తవ మత పెద్దలు, క్రైస్తవ సోదర సోదరీమణులు వేలాదిగా వచ్చినప్పటికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా జరగడంలో వివిధ శాఖల అధికారులు కీలక పాత్ర పోషించారు. ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం, సీటింగ్ అరేంజ్మెంట్, భారీ బందోబస్తు, ప్రణాళికాయుత ట్రాఫిక్ మళ్లింపు, తాత్కాలిక వైద్య శిబిరాలు, అతిథులకు అల్పాహారం తదితరాలతో పాటు కేక్ కటింగ్, క్యాండిల్ లైట్ సర్వీస్ తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లు ప్రశంసలు అందుకున్నాయి. ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించడం వల్ల ఏర్పాట్లు లోటుపాట్లు లేకుండా జరిగాయి. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాటు నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రానా టాటా, రెవెన్యూ, పోలీస్, విజయవాడ నగర పాలక సంస్థ, మైనారిటీ తదితర శాఖల అధికారులు చేసిన కృషి ఫలితంగా వేడుకలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డిల్లీరావు తెలిపారు.

జాతీయస్థాయి టిటి ఛాంపియన్షిప్‌లో సిద్ధార్థ మహిళ కళాశాల విద్యార్థినికి బంగారు పతకం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 11 నుంచి 15 వరకు చండీగఢ్లో జరిగిన జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్షిప్ లో శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని ఎం సుచిత్ర బంగారు పథకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ పద్మజా తెలియజేశారు. జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం ద్వారా అంతర్జాతీయ పోటీలకు ఎంపిక అవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సందర్భంగా సుచిత్రను ఉపాధ్యాయులు విద్యార్థినిలు అభినందించారు.

కాపీరైట్ ఉల్లంఘన కేసుల్లో పీపీఎల్ ఇండియాకు గణనీయమైన విజయాన్ని అందించిన ఢిల్లీ హైకోర్టు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: కొత్త ఏడాది మరియుక్రిస్మస్ వేడుకల సందర్భంగా, ఫోనోగ్రాఫిక్పెర్ఫార్మెన్స్ లిమిటెడ్ 70 లక్షల పాటల విస్తృతమైన కేటలాగ్‌నురక్షించేందుకు సిద్ధమైంది. దానికి కారణం కాపీరైట్ ఉల్లంఘనకు వ్యతిరేకంగా ఢిల్లీహైకోర్టు అద్భుతమైన నిర్ణయాన్నిఅందించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల, అవసరమైన లైసెన్స్ లేకుండా పిపిఎల్ కు సంబంధించిన కాపీరైట్పాటలను ప్లే చేసే అవకాశం ఉండదన్నారు. అంతేకాకుండా చండీగడ్ డీజే అసోసియేషన్ తప్పుదోవ పట్టించే ప్రచారాలను కూడా ఢిల్లీహైకోర్టు తీవ్రంగా పరిగణించిందన్నారు. ఈ సంస్థ పీపీఎల్ ఇండియా నుంచి లైసెన్స్‌లనుపొందకుండా కాపీరైట్ సంగీతాన్ని ఉపయోగించుకునేందుకు ప్రయత్నించాయన్నారు. న్యాయస్థానంఅలాంటి సంఘాలను నిస్సందేహంగా నిరోధించిందనీ, పీపీఎల్ తన విస్తృతమైన సంగీత కచేరీలయొక్క చట్టబద్ధమైన ఉపయోగం కోసం లైసెన్స్‌లను జారీ చేసే హక్కును పునరుద్ఘాటించిందన్నారు. కంపెనీని సంప్రదించిన తర్వాత, కాపీరైట్ హోల్డర్ల హక్కులను కాపాడడంలో, మరియు క్రియేటర్స్ కు న్యాయమైన పరిహారం అందేలా చేయడంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చినతిరుగులేని మద్దతుకు పీపీఎల్ ఇండియా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిందన్నారు. ఈఅద్భుతమైన తీర్పు సంగీత పరిశ్రమలో మేధో సంపత్తి హక్కులను గౌరవించడం యొక్కప్రాముఖ్యతను బలపరుస్తాయనీ వివారించారు.

23న దివిసీమలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 23 వ తేది దివిసీమలో వైకుంఠ ఏకాదశికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. అవనిగడ్డ లక్ష్మీనారాయణ స్వామి, గీతామందిరం. మండల పరిధిలోని పులిగడ్డ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, వేకనూరు సంతాన వెంకటేశ్వర స్వామ వారి ఆలయాల్లో మార్గశిర శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వైకుంఠ ఏకాదశి, గీతాజయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ యా ఆలయాల ధర్మకర్తలు బుధవారం తెలిపారు. లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయం, గీతామందిరంలో ఆ యా ఆలయ అర్చక స్వామి దివి నరసింహామూర్తి బ్రహ్మత్వంలో విశేష కార్యక్రమాలల నిర్వాహణలో భాగంగా 22వ తేది శుక్రవారం ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, సువర్ణ పుష్పాలతో విశేష అర్చనలు జరుగుతాయన్నారు. శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాలు వేకువ జామునే 5 గంటలకు జరుగుతాయని శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారి కోయల్ ప్రదక్షణ, భగవత్ గీతా పారాయణం, మధ్యాహ్నం నుండి స్వామి వార్ల గ్రామోత్సవం జరుగుతాయని, గీతామందిరంలో పర్చూరి దుర్గాప్రసాద్ - జాన్సీ వాణి దంపతుల ఆద్వర్యంలో జరుగుతాయని గీతా మందిర కమిటీ చైర్మన్ యర్రంశెట్టి శ్రీహరిబాబు తెలిపారు. తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు అలసత్వం

విశాలాంధ్ర-అవనిగడ్డ : కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు అలసత్వం వహిస్తున్నారని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ నియోజకవర్గ కన్వీనర్ భూపతి సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం భారత ప్రభుత్వం భారతదేశ ప్రజాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న వికసిత భారత సంకల్ప యాత్ర నియోజకవర్గంలోని అవనిగడ్డ పంచాయితీ, పాత ఎడ్లంక పంచాయితీలలో గ్రామ సభ నిర్వహించారని సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ గ్రామ సభల విషయంపై గత 6 సంవత్సరాలుగా ఇఒ గా విధులు నిర్వహిస్తున్న అధికారి కానీ, మిగిలిన అధికారులు కానీ గ్రామ సభ జరిగే విధనాన్ని గ్రామంలో మైక్ ద్వారా కానీ, టాం టాం ద్వారా కానీ తెలియపరచలేదని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులకు ఉన్న చిత్తశుద్ధిని తెలియచేస్తుందన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నో నిధులు ఇస్తున్నప్పటికి గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత వైయస్ఆర్‌సిపి ప్రభుత్వం కానీ మంచినీటి కులాయి కనెక్షన్ మాత్రం ఇవ్వడం లేదని పంచాయితీ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేసిన అనంతరం న్యాయస్థానాన్ని ఆచరిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 17 రకాల ప్రజాభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే సంబంధిత అధికారులు లబ్ధిదారులను, ప్రజలను తీసుకురావడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలకు లబ్ధి చేకూర్చాల్సిన అధికారులు ఈ విధంగా చేయడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి ఆయుష్మాన్ భారత్ పథకం లబ్ధిదారులకు 5 లక్షల ఆరోగ్య భీమా ఇస్తుంటే వాలంటీర్లు వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అన్ని నిధులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మేమే ఇస్తున్నాం అని చెబుతున్నారని, పి.ఎం.ఎ వై ద్వారా గృహ నిర్మాణం కోసం కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పుకోవడం జరుగుతుందని,నేటికి కొన్ని గృహాలు ప్రారంభ దశలోనే ఉన్నాయని, వీటిని వెంటనే 100 శాతం గృహ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని భూపతి డిమాండ్ చేశారు.

ఉజ్వల యోచన పథకం - గ్యాస్ కనెక్షన్ పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : వికసిత్ భారత్ పై అవగాహన కల్గించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందచేయాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన యాత్ర దేశ వ్యాప్తంగా అన్నీ రాష్ట్రాల్లో ప్రారంభం కాగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల ప్రజాభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం అవనిగడ్డ పంచాయితీ కార్యాలయంలో అవగాహన నిర్వహించారు. కేంద్ర పథకాలు అయిన ఉచిత రేషన్, ప్రధానమంత్రి ఆవాశయోజన, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఉజ్వల యోజన వంటి పి.ఎం.ఎ.ఎ.ఐ లాంటి మొత్తం 17 రకాల పథకాలను ప్రజలకు వివరించి అవగాహన కల్గించారు. వికసిత భారత్ సంకల్ప యాత్ర నియోజకవర్గ కో ఆర్డినేటర్ తుంగల గిరి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.పి.పి తుంగల సుమతీ, జడ్.పి.టి.సి చింతలపూడీ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి గాజుల జయగోపాల్, ఎం.పి.డి.ఓ ఎం మరియాదేవి, తహశీల్దార్ ఎల్ శివరామకృష్ణ, విజయకృష్ణ గ్యాస్ అధినేత మత్తి శ్రీనివాసరావు లు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్ అందచేసి కేంద్ర పథకాలపై అవగాహన కల్గించారు. మండల పరిధిలోని పాత ఎడ్లంక పంచాయితీ కార్యాలయం వద్ద వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీల కార్యదర్శి తోట శ్రీనివాసరావు, పంచాయితీ సిబ్బంది లతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

దివిసీమలో సెమి క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివిసీమలో పెద్ద ఎత్తున సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సీతాయలంకలోని రవి పాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలలో బుధవారం శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొని నీ వలె నీ పొరుగు వారిని కూడా ప్రేమించు అనే వాక్యం అందరికి ఆదర్శనీయం అని ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలు పాటిస్తు సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సెమి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి 40 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఎస్.టి కాలనీలోని సర్వకృపానిధి మందిరంలో జరిగిన సెమి క్రిస్మస్ వేడుకలలో పాల్గొని 20 మందికి చీరలు పంపిణీ చేసి ఏసు వాక్య సందేశాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ స్టీఫెన్ జయరాజు, ప్రసాద్, జీవన ప్రసాద్, వనాసి మాయి, వినయ్ కుమార్, ప్రవీణ్ బాబూరావు, సంఘస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పి.డి.ఓ మరియాదేవి ఆద్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇ.ఒ.పి.ఆర్.డి పి శైలజా కుమారి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ఏసు వ్యాక్యలను తెలిపి క్రీస్తు బోధనలు అందరికి ఆదర్శనీయం అని శాంతి, సహనం, ప్రేమ, దయతో అందరూ నడుచుకోవాలన్నారు. ఎం.పి.పి తుంగల సుమతీ ఏసు బోదనలు నేటి తరానికి ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి సభ్యులు,మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొనగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.

నేటినుంచి సప్తాహ మహోత్సవాలు

విశాలాంధ్ర-గంపలగూడెం: మండలంలోని మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో నేటి నుంచి 46వ వార్షిక హరే రామ నామ సప్తాహ మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ మేనేజర్ జే. వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల. రామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు విఘ్నేశ్వర పూజతో ఆలయం ప్రధాన అర్చకులు కోమందూరి. రామచంద్రాచార్యులు, అర్చక బృందంచే ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభిస్తారు. పుణ్యాహవచనం, ఋత్వికరణ, అఖండ స్థాపన, మన్యసూక్తఅభిషేకం జరుగును. 21వ తేదీన స్వామికి సహస్రనామ సిం ధూరార్చన నిర్వహిస్తారు. 22వ తేదీన అష్టోత్తర శత కలశాభిషేకం, 23వ తేదీన ముక్కోటి ఏకాదశి, గీతా జయంతి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శత హనుమాన్ చాలీసాపారాయణ, జరుగుతాయన్నారు. 24వ తేదీన సామూహిక హనుమాన్ వ్రతం నిర్వహిస్తామన్నారు. 25వ తేదీన వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో విశేష పూజలు జరుగును. 26వ తేదీన దత్త జయంతి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 27వ తేదీన హనుమత్ స్వాములకు ఇరుముడి, పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరుగును. సప్తాహం సందర్భంగా ప్రతిరోజు మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన జరుగుతుంది. ఈ సప్తాహ మహోత్సవాల లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వీరాంజనేయ స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ మేనేజర్ జె. వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల. రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

రావి జన్మదినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర-గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు జన్మదినోత్సవేడుకలు టిడిపి కార్యకర్తల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు జన్మదినోత్సవ వేడుకలను టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణా మహిళ అధ్యక్ష, కార్యదర్శులు యార్లగడ్డ సుధారాణి, గోర్ల శ్రీలక్ష్మీ, మజ్జాడ నాగరాజు, దారపురెడ్డి మణేశ్వరరావు, పులవర్తి డేవిడ్, టిడిపినాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సెమ్మీ క్రిస్మస్

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక శ్రీకాళహస్తి కాలనీలో రెవ॥ పాస్టర్ టి.మధుబాబు అధ్యర్యంలో మంగళవారం రాత్రి సెమ్మీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాక్సోపదేశకులు రెవ॥ పాస్టర్లు ఎం.విజయరాజు, దైవ.పోర్లలు పాల్గొని దేవుని సదేశం ఇచ్చారు. అనతరం సెమ్మీ క్రిస్టమస్ వేడుకలను వైపిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషన్, వైసిపి నాయకులు పాలేటి చంటిలు క్రిసమస్ కేక్‌ను కట్ చేశారు. అనతరం దుస్తులను పంపిణి చేశారు. శశిభూషన్, చంటిలను పాస్టర్ రె॥ మధుబాబు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిడిపిపియఫ్ పాస్టర్స్, సంఘ పెద్దలు, సంఘస్థులు పాల్గొన్నారు.

వైసీపీ పట్టణ అధ్యక్షుడిగా మునగాల మల్లేశ్వరరావు

విశాలాంధ్ర-మంగళగిరి : ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయటం, అదే రోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజక వర్గ సమన్వయకర్త (ఇంచార్జ్)గా గంజి చిరంజీవిని నియమించిన విషయం విధితమే. అప్పటి నుంచి మంగళగిరిలో జరిగే రాజకీయ పరిణామాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. చిరంజీవి తన మార్క్ రాజకీయం మొదలు పెట్టారు. గతంలో వైసీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన మునగాల మల్లేశ్వరరావును తిరిగి అదే పదవిలో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని బుధవారం చిరంజీవి చేతుల మీదుగా ఆయన నివాసంలో మల్లేశ్వరరావుకు అందజేశారు. ఇందుకు ధన్యవాదాలు తెలుపుతూ, చిరంజీవి ఇంచార్జ్‌గా నియమితులైన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ మునగాల మల్లేశ్వరరావు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మీ దంపతులు చిరంజీవికి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా తనకు తిరిగి అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు, వైసీపీ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవిలకు ధన్యవాదాలు తెలియజేశారు. గంజి చిరంజీవిని మంగళగిరి ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళగిరిని చక్కగా అభివృద్ధి చేశారని తెలిపారు. కొన్ని కారణాల వలన ఆయన తప్పుకోవాల్సి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సై వినోద్‌కుమార్‌కు సీఐగా పదోన్నతి

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న డి.వినోద్ కుమార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. 2010 సబ్ ఇన్‌స్పెక్టర్ బ్యాచ్‌కి చెందిన వినోద్ కుమార్ పెద్దకాకానిలో ట్రైనింగ్ ఎస్సైగా, మంగళగిరి టౌన్, చేబ్రోలు, తాడేపల్లి, వట్టిచెరుకూరులో ఎస్సైగా విధులు నిర్వహించి ప్రస్తుతం తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసినటువంటి వినోద్ కుమార్ త్వరలో సీఐగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. వినోద్ కుమార్‌కు పలువురు పోలీస్ సిబ్బంది, జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-గుంటూరు : స్టాఫ్ సెలక్షన్ కమీషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, రీ సస్టైయినబిలిటీ లిమిటెడ్, గ్రీన్‌స్పేస్ హౌసింగ్ అండ్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌లు ఉచితంగా అందిస్తుందని రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎంపీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులో 250 మంది, గుంటూరులో 250 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. సాయుధ బలగాల నియామకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 26 వేలకుపైగా కానిస్టేబుళ్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని, పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 23 ఏళ్లలోపు గల ఓసీ అభ్యర్థులు, 26 ఏళ్లలోపు ఓబీసీ, 28 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. మొదటి విడత అర్హత పరీక్షకు హాజరు కాలేకపోయిన ఆంధ్రప్రదేశ్ అభ్యర్థుల సౌకర్యార్థం ఈ నెల 23న తుళ్లూరు మండలంలోని పెదపరిమి గ్రామంలో గల రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో మరోసారి అర్హత పరీక్ష నిర్వహించ నున్నట్లు చెప్పారు. అర్హత పరీక్ష ఫలితాలను 24న, ఎన్నికైన అభ్యర్థుల జాబితాను 25న ప్రకటించ నున్నట్లు వెల్లడించారు. ఎన్నికైన అభ్యర్థులు 26వ తేదీ నుంచి శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. శిక్షణతోపాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తారని అన్నారు. పూర్తి సమాచారం కోసం https://forms. gle/YPfsx ZaBR5me4ZUM9 లింకులో శోధించవచ్చని చెప్పారు. వివరాలకు 7337 585959, 9000797789 నంబర్లలో సంప్రదించవచ్చని అన్నారు.

బీఎస్పీ గెలుపు దిశగా పయనించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని మోదీ,రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలను గద్దె దింపటానికి ప్రజలందరు ఏకత్రాటిపైకి వచ్చారని బహుజన సమాజ్ పార్టీ(బి ఎస్ పి) ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్,రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ తెలిపారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హనుమాన్‌పేటలోని మారుతి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో పార్టీని శక్తివంతంగా నిర్మాణం చేయాలని,రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం గా పనిచేయాలని రాష్ట్ర నాయకులకు సూచించారు. ఫిబ్రవరి నెలలో పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి రాష్ట్రానికి రానున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో దళితులపై దాడులు,అకృత్యాలు పెచ్చరిల్లాయని అన్నారు. దళితల ఓట్లుతోనే అధికారంలోకి వచ్చి తరువాత వారికి ఉన్న 26 పథకాలను రద్దు చేశారన్నారు. అంతే కాకుండా పరిపాలన సైతం సక్రమంగా జరగటంలేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టడంలో ప్రతిపక్ష టీడీపీ వైఫల్యం చెందిందన్నారు.రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ఓడించి బిఎస్‌పి ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ నాయకులు రానున్న ఎన్నికల్లో కష్టపడి పార్టీ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జోన్ కో-ఆర్డినేటర్ లను నియమించారు.ఉత్తరాంధ్రకు రాజారావు,లక్ష్మణరావు, ప్రకాశరావు లను,జోన్ -2. సెంట్రల్ జోన్ కు, గుమ్మాపు చిత్రసేన, బచ్చలకూర పుష్పరాజు, జగన్మోహన్ రావు లను,జోన్ -3. రాయలసీమకు ఆర్ జె మల్లికల్, పి. గురప్ప, విజయ్ కుమార్ లను నియమించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎం. బాలయ్య, ఎల్ రాజారావు, బి గౌతమ్ కుమార్, మల్లికల్, గురప్ప, వందన్ కుమార్, పుష్పరాజు, తిరుపతి రావు, జానకి ప్రసాద్, విజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

తాడేపల్లికి చేరుకున్న ఇప్టా పాదయాత్ర

విశాలాంధ్ర-తాడేపల్లి : స్వాతంత్ర్య పోరాటంలో స్వాతంత్ర్యం మా జన్మహక్కు అని పోరాడిన కళా సంస్థ ఇప్టా అని ఆ సంస్థ జాతీయ కార్యదర్శి గని అన్నారు. అఖిలభారత ప్రజానాట్య మండలి జాతీయ స్థాయి పాదయాత్ర బుధవారం మధ్యాహ్నం తాడేపల్లికి చేరింది. పాదయాత్రకు సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మునగాల రామారావు ఘన స్వాగతం పలికారు. నులకపేటలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు ఇప్టా జాతీయ కార్యదర్శి గని, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య, ప్రజానాట్య మండలి కళాకారులు సంపూర్ణ మద్దతు తెలిపారు. గని మాట్లాడుతూ కళ ప్రజల కోసం అనే నినాదాన్ని ఆచరణలో పెట్టి దేశంలో సంస్కృతి, సాంప్ర దాయాలకు, లౌకికతత్వాలకు జీవం పోసిందన్నారు. భారతదేశ కళా రంగానికి స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగించి కళాకారులను సంఘటిత శక్తిగా ముందుకు నడిపించిన శక్తి, సమరశీల ఉద్యమాల రథసారథి ఇప్టా అని కొనియాడారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య మాట్లాడుతూ మానవత్వం కనుమరుగైపోతున్న తరుణంలో 'శాంతి, ప్రేమ, కరుణ, దయ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమన్యాయం' అంశాలను ప్రధానంగా తీసుకుని పాదయాత్ర చేపట్టడం జరిగిందని అన్నారు. అంతరించిపోతున్న మానవతా విలువలను కాపాడుకోవడం కోసం కళారూపాల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చే బాధ్యతను గుర్తించి ముందుకు సాగుతుందని అన్నారు. అనంతరం పాదయాత్ర నులకపేట, ఉండవల్లి సెంటర్, ప్రకాశం బ్యారేజీ మీదగా, భవానిపురం చేరుకుంది. తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్ అభ్యుదయ గేయాలు ఆలపించారు. పాదయాత్రలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర ఆఫీసు బేరర్స్ ఎస్‌కే నజీర్, ఎ.శివయ్య, మహంత లక్ష్మణరావు, ఆరేటి రామారావు, సీతారాం, ప్రసాద్, పోతురాజు, నాగేశ్వరరావు, డప్పు సూరి, నాగభూషణం, అనంతలక్ష్మి, స్వర్ణ సులోచన, సీపీఐ నాయకులు తుడి మెల్ల వెంకటయ్య, మునగాల రామారావు, మానికొండ డాంగే, సీపీఎం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి, బూరగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-గుంటూరు : ది గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆటో స్టాండ్ సభ్యులు ఆర్.కోటేశ్వరరావు అనా రోగ్య కారణంగా చేయి పడి పోవడంతో జీజీహెచ్ ఆటో స్టాండ్ డ్రైవర్స్ అందరూ కలిసి కొంత ఆర్థిక సహాయాన్ని కోటేశ్వరరావుకు బుధవారం అందజేశారు. నాలుగు నెలలకు సరిపడ సరుకులు (రూ.7500), అదేవిధంగా నగదు రూ.6500లను డ్రైవర్ కోటేశ్వరరావుకు అందించారు. యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి ఆసుపత్రి చికిత్సకు అయ్యే బిల్లులో కొంతమొత్తాన్ని తగ్గించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు, అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, కమిటీ సభ్యులు నందూరి రోశయ్య, వై.శివ, టి.రాము, టి.సతీష్, నాగ రమేష్, భాస్కర్, బత్తుల శ్రీను, శివకోటి, సాంబశివరావు, అంజి, ఏసుపాదం, బాబు, హనుమంతు, కిరణ్ పాల్గొన్నారు.

సింహాద్రి వెంకటేశ్వరరావును పరామర్శించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం రేవేంద్రపడు గ్రామ సీపీఐ సీనియర్ నాయకుడు సింహాద్రి వెంకటేశ్వరరావు హార్ట్ సర్జరీ చేయిచుకొని హాస్పటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని పెద్దవడ్లపూడి, రెవెంద్రపాడు గ్రామ సీపీఐ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరావుని పరామర్శించి ఆయన ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పరామర్శించిన వారిలో సైకం శివయ్య, సయ్యద్ కరీముల్లా షా, నాగళ్ళ వెంకట్రావు తదితరులు ఉన్నారు.